# కొలుములు రగులుకుణ్ణాయ్!

అది ఏ కొంపలో అయినా సరే!- ఆ పూటకు పొయ్యి రగిలిందంటే యింకేంపరవాలే. ఆ పూట గడ్సి పొయ్‌నట్టే లెక్క. అయితే ఈ దేశింలో మూడు పూట్లూ పొయ్యి రగిలేదంటే మాట్లా?

అదే మా బాశాలి కైతేనా? నిమిశ నిమిశానికి రగలమంటే రగిల్తింది. ఏంది? ఒళ్లు!... ఆ పెకు వొళ్లు గానా రగిలిందంటే యింక ఆ పూటకు ఏడ్సి మొకం కడుక్కుణ్ణట్టే లెక్క!

ఆ మాటకొస్తే ఈ రగడలు రగలడాలు నా కొంపలోనేగాదు. ఏ కొంపలో అయినా అంతేగదా! లేదంటే కొందురు సంసారం గుట్టని బయిపడి చెప్పుకోలేకుండా బాదపడ్తా వాళ్లల్లోవాళ్లే కుమిలి కుమిలి చస్తారు. కుమిలి కూరాకయ్యే దెందుకని నేను మణుసిప్పి చెప్పేస్తా ఉండా. అంతే వెత్తాసం. ఆ మాటకొస్తే శానామంది బీకారానికి అట్టా కనిపిస్తారేగానీ కాపరాల్లోకి అట్టా తొంగిచూస్తే తొంబైయారు తూట్లు కనబడతాయి. ఆ లెక్కన చూస్తే మా బాశాలి ఎంతో మేలుగదా? అడగాలనుకుణ్ణిందంటే చాలు. అయిదే నిమిశాల్లో కడిగి పారేస్తింది. ఐసా పైసా అట్నోయిట్నో తేల్సుకుంటింది. అయినా-

ఏమాట కామాట చెప్పుకోవాల గదా? మా బాశాలి మాటొగిటే కొంచిం తుస్కారం. మణుసు ఎన్నగదా? మాటా మాటా పెరిగి మణుసు యిరిగి మణిసి అరగెంటగాన అవుపించకుండా బోతే చాలు, ఇంటి బయిట గడపట్టకానుకోని కండ్ల నీళ్లు పెట్టుకుంటింది. పటాలానికి పొయ్‌న మొగుడి కోసరం పడుచుపిల్ల ఎదురు చూసినట్టు చూస్తా ఉంటింది.

అట్లాంటి మణిసికి ఎప్పుడు రగిలితిందో? ఎందుకు రగిలితిందో? ఎట్ల రగిలితిందో పసిగట్టమని పోలీసు కుక్కల్ను యిడ్సి పెట్టి చూడండి. తోక ముడ్సుకోని ముడుక్కోక పోతే నామిందొట్టు!

''మేము. మా గలీజు బతుకులు. ఎట్లుండాయో మీ కక్కుర లేనపుడు మీ బతుకుల మింద మాత్రం అక్కుర మా కెందుకు? మీరు మమ్మల గెమనించకుండా బోతే మీరెట్లా బతకతారో మేవు గూడా గెమనించుకుంటాం.'' అంటా తిరపతిలో పాకీపనోళ్లకు రగిలె.

ఆ పొద్దు మా యింట్లో మా బాశాలికీ రగిలె.

ఊరంతా మురిగి కంపులో మునిగి పొయ్యేటట్లు చేసేదానికి పాకీపనోళ్లకు ఏడేడు పద్నాలుగు దినాలు పట్టింది. అదే మా కొంపలో రంపు రగలబడి పోవాలంటే ఎంచినట్లు ఏడే ఏడు నిమిశాలు చాలు. ఏడునిమిశాలా? ఎందుకూ? ఆపె గానా తల్సుకుంటే దాంట్లో గూడా వొగిటి రొండు నిమిశాలు మిగిలిపోతాయి!

''పాపం! ఆయన్న ఎంగట్రెడ్డి. నోరువాయీ రొండూలేని మణిసి. లేక లేక ఈసారేమో నిలబెట్నారంట. అట్లబొయ్ ఆ గెంటాణ పల్లిలో ఉడతాబగితి. సెప్పిన కాడికి సెప్పేసి రావచ్చుగదా? నోటి మాటే గదా? ముత్తాలేమన్నా రాలిపోబోతాయా? మల్లా నోరుతెరిస్తే నాదింతలావు. అంత పొడుగు. అంటా మాటలు చెప్తే సరిపోతిందా? అదే యిజియవాడ యిశాకపట్నమో అను. ఇడ్సి పెట్టిందే సాలని ఎగబెట్టుకోని పరిగిత్తాడు. ఏం మొగోళ్లో ఈ మొగోళ్లు? వగతాగా రొండూ లేనోళ్లు!''

ఊరికి ఉత్తరంగా మాలోడిగుండం. వానాకాలాన ఆ గుండంలో నీళ్లు దూకతాయి. ఒక్క మోపన చెవులు చిల్లులు పడేటట్లు దూకతాయి. మా బాశాలి నోట్లో మాటమింద మాట ఒగిటే మోపన దూకతా ఉంటే మాలోడి గుండం మణుసులో మెదిలె.

ఇంట్లో ఈ రంపుకంటే యీదిలో ఆ కంపే మేలు.

గాందీగారి కోతిని తల్సుకుంటా ఎలబార్నా.

ఎలబార్తే ఏముండాది? ఎంచినట్లు ఏడడుగులులేస్తే ఎదురంగా నాలుగ్కాళ్లమండపం. అదిగానా కంటపడ్తే కాలుగదల్తే. ఒక వక్కపలుకు కొరికనంత సేపైనా ఆడ నిలబడమంటింది. నిలబడుకుణ్నా. ఎట్లచూసినా రోడ్ల మింద చెత్తాచెదారం కుప్పలు కుప్పలుగా పేరుకోని పొయ్యుండాది. ఆ చెత్తాచెదారం అడ్డం పడేకుందికి సైడు కాలవల్లో మురికి నీళ్లు రోడ్లమిందికి మల్లు కుణ్నాయి. మిడిమిల లోతున పార్తా ఉండాయి. చీరలెగచెక్కుకోని ఆడోళ్లు... పంచలు ఎగబెట్టుకోని మొగోళ్లు... ముక్కులు మూసుకోని కొందురు... మూతులు చిట్లిస్తా కొందురు. ఎవురి దోవన వాళ్లు పోతా వుండారేగానీ ఒక్క సెణం అట్లా నిలబడి ఊరిట్లా గబ్బుకొట్టుకోని పోతావుంటే ఏమి చెయ్యాల? ఎట్లచెయ్యాల? అని ఆలోచించిన పాపాన పోలేదే? –

పోతేపోనీ! ఈ బతుకుల్లో ఎవుడి బాదలు వాడివి. ఎవుడి అగసాట్లు వాడివి.

పొయ్యేవాళ్లనట్టా. దొంగలదోలేద్దాం. ఆడ ఉండేవాళ్లు! ఎంతమంది? ఒకరా యిద్దరా? ఓయబ్బా? ఓపినంత మంది!

వాళ్లకతలు ఎట్టుండాయంటే?

''ఒరే! పాకాల్లో పంచాయితీ ఎలక్సన్లో పోటీజేస్తా ఉండేది యిద్దరు తెలుగు దేశిం పార్టీ వోళ్లేనంట. అప్పుడే ఎవుడికోడు గోడలమింద రాయించేస్తా ఉండారంట. కాగితాలు గూడా అచ్చేసుకుణ్ణారంట. ప్రెచారం చేసుకుంటా యింటింటికి తిరగతా ఉండారంట.''

''నువ్వు సెప్తా ఉండేది బలే బాగుండాదే? ఎలక్సన్లో నిలబడ్తే ప్రెచారం సేసుకోకుండా నెత్తిన చేతులు పెట్టుకోని యిశారపడ్తా కూసోమంటావా? ముసిలి దానికి పండ్లొస్తే ముంతకు కాళ్లొచ్చినట్టు అదేందో పెద్ద యింత మాదిర సెప్పుకుంటా ఉండావే?''

''తలకాయిలో ఉండాల్సిందుంటే పరవాలే. ఆడ ఉండేదేంది? మట్టి? అటువంటి జల్మాలకు అసలు పాయింటు తలకెక్కి సస్తిందా? పాడా? ఇద్దూరూ వొగిటే పార్టీవోళ్లు పోటాపోటీ మిందుంటే యింక ఆ పార్టీవోళ్లు ఎవుడికి అవుననాల? ఎవుడికి కాదనాల? ఎట్టజెప్పేదానికి తోచకుండా ఎర్రినాయాలి గుంపుకు నిద్దరపట్టని సావేగదా?''

''అవునవునబ్బా! వాళ్లుందురికి నిద్రేపట్లేదని యితగాడు పాయ్ ఊరికేగాదు- లైటేసి సూసొచ్చినాడు. వొచ్చి సెప్తా ఉండాడు. యినంద్రా. అందురు సెవులు నిక్కబెట్టుకోని యినండి. ఈ కాలంలో నిద్ర? నాసామిరంగా! రొండు పెగ్గులు మనవి కాదనుకుంటే నిద్ర యాడికిబోతింది. రమ్మంటే పరిగెత్తుకోని రావద్దా?''

''ఒరే నువ్వు జెప్పేది యింకా బాగుండాదే? తాగేసి నిద్దర బొయ్యే దానికా ఎలక్సన్లో నిలబడేది? అదట్టా ఉణ్ణీ! పాకాల్లో వొగిటే పార్టీవోళ్లు రంగంలో వుంటే ఎంగళత్తూర్లో అయితే అన్నాదమ్ముళ్లే యిద్దరూ మోటుకుణ్ణారంట. ఇంక చూస్కో ఊళ్లోవాళ్లకు ఎట్టజేసే దానికీ తోసలా. ఎట్ట మల్లగుల్లాలుపణ్ణా దోవకుదర్లా. అప్పుడు అట్టా యిట్టా కూడా కాదని యాలంపాట పెట్నారంట. తమ్ముడు నలబై ఆరువేలు దాకా పాడె. అన్న ఆసిపత్రి పరమై ఉండాడు. ఉండచ్చుగదా? ఆడ కొంపలేమో అంటకపోతా వుణ్ణెట్టు ఆపసోపాలు పడ్తా పరిగెత్తుకోనొచ్చె. వొచ్చి రావడంతోనే నలబై ఎనిమిది అంటాడా?''

''వాళ్లకత ఆడికయిందా? ఏర్పేడు మండపంలో మర్రిమంద. అదొక ఎర్రిమంద. ఆ ఊళ్లో మనకుతెల్సి ఎప్పుడైనా ఎలక్సన్ జరిగిందా? పంచాయితీ ఎలక్సన్లొచ్చి యిన్నేండ్లయింది గదా? ఎప్పుడైనా ఎవుడైనా ఓటేసిన పాపాన పొయ్‌నాడా? అందురూ ఆ పొద్దుటికి ఉడ్డజేరుకుండేది. 'ఈడు ప్రెసిడెంటు. ఇద్దోయిూళ్లు నంబర్లు.' అనుకుంటా ఉండ్రి. అట్టానే జరిగిపోతా వుండె. అటుమంటిది యిప్పుడా గొర్రెమందలో గూడా రగులుకుణ్ణిందంటే?...''

''ఒరే నువ్వు మర్రిమంద కత సెప్తివి. నేను పుంగనూరు కత సెప్తా ఉండా. యిను. పుంగనూరు మండలంలో బండ్లపల్లి. ఆ ఊళ్లో అయితే యిస్కూలికి యిరాళం యిస్తేనే

నామినేషన్ ఎయ్యనిస్తామని పట్టుబట్టి కూసుణ్ణారంట!''

''బండ్లపల్లిలో బండముండా కొడుకులు. ఇస్కూలికి యిరాళం యిస్తేగానీ కుదరదంటే కుదరదని కూసుణ్ణారు. అదే పాకాల మండలం యిరంగారిపల్లిలో యిరాళం యిర్వైవేలు యిస్తానంటే గూడా 'యిరాళాలు మా కొద్దు. పోటీయేముద్దు!' అంటా ఉండారంట.''

ఇట్లా ఎవుడికి తెల్సింది వాడు. ఎవుడికి తోసినట్టు వాడు. ఆ నాలుగ్గాళ్లమండపం కాడ నిలబడుకోని ఆ రొచ్చులో ఎలక్సన్ల కతలు అదొక ఏడిగ్గా చెప్పుకుంటా ఉండారు.

వాళ్ల కండ్ల ముందర కంపు వాళ్లకు కనపల్లా!

ఎలక్సన్లో నిలబడ్తా ఉండే యదవలకు పల్లెకొంపలు ఎట్టుండాయో తెల్దా?

అసలు ఎలక్సనంటే ఏంది? ఓటంటే ఏంది? దాని యిలవేంది? దాన్ని ఎవుడికెయ్యాల? అనే ఆలోచన ఏ ఒక్క యదవకన్నా ఉంటే ఈ యాలంపాటలేంది? ఈ యిరాళాలేంది? ఇదేమన్నా యాపారమా? బేరమాడి కొనుక్కుండే దానికి? సొతంత్రం వచ్చి నలభై ఏండ్లు అవతా ఉండాది. ఇంకా ఓటంటే ఏందో తెల్సుకోలా. ఎట్టబ్బా ఈ ముదనష్టపు గుంపుతో ఏగేది?

ఆ ఏడుకొండల మిందుండే వాడు ఎకాకిని దిగబడి- వాడు రాడులే. అదొక బ్రెమ. అయినా వచ్చి-

''ఒరే అబ్బోడా! నువ్వు ఎప్పుడైనా దొంగతనం చేసినావా?'' అని అడిగితే-

''చేసినాను!'' అని చెప్తా.

''అపద్దం చెప్పినావా?'' అంటే-

''అడుక్కొకగిటి!'' అంటా.

''సూర్రె చంద్రుల సాచ్చిగా సురలు ముక్కోటి దేవతల సాచ్చిగా కట్టుకున్న ఆడదానికి అన్నాయం చేసినావా?'' అని అడిగితే.

''వోల్‌రైట్‌గా!'' అంటా.

''ఒరే! యిన్ని చేసిన యదవన్నర యదవా? నీ చేతలారా ఎప్పుడైనా ఒక్క మంచి పని చేసినావా?'' అంటే-

''అదిగూడా చేసినాను!'' అంటా.

''ఏందబ్బా ఆ మంచిపని?'' అని ఆ ఎర్రి మొకవోడు చూస్తా వుంటే-

''నేను పుట్టి బుద్దెరిగిన నాటినుండి ఎలక్సన్లో ఓటెయ్యలేదు. అదే ఈ జెల్మానికి నేను చేసిన మంచిపని'' అంటా.

అటుమంటోణ్ణి. నేను పొయ్యేదేంది! ఎలక్సన్లో నిలబడ్తా వుండే వెంకటరెడ్డికి సపోటు

చేసేదేంది? మా బాశాలి సతపోరింది... ఆ నాలుగ్గాళ్లమండపం కాడ యినింది తల్సుకుంటా ఉంటే వొళ్లు దాని పాటికది ఏడెక్కిపోతా ఉండాది.

ఎవురో ఒకాయిన నా మాదిర్నే ఆడ నిలబడుకున్నాడు. అంతా యిన్నాడు. నాకల్లా చూసినాడు. ఒక ఎర్రి నవ్వు నవ్వినాడు.

''కొలుములు రగులుకున్నాయ్ రా అబ్బోడా! రగులు కున్నాయ్!'' అంటా తన దోవన తాను పాయ.

''కొలుములు రగులుకుంటే అంతకంటే కావాల్సింది ఏముండాదబ్బా?'' అని ఆలోచిస్తా ఉంటే నా మణుసు మా ఊళ్లో కొలిమి చింతమాని కాడికిపాయ.

ఊరి ముందర మంచి నీళ్లగుంట. ఆ గుంట కట్ట మింద చింతమాను. ఆ చింతమాని కింద కొలిమి. ఆ చింతమాను ఎప్పటిదో ఏవో? మా అయ్య వాళ్లయ్యల కాలానిది. కొలిమి పెట్టి చింతచెట్టు నాటినారో? చింతచెట్టుకింద కొలిమి పెట్నారో! అది కొలిమి చింతమానయింది. దానికింద కొలిమి రగిలిందంటే ఆడ ఒక తిరణాల జరిగినట్టుండేది.

ఆ చుట్టు పక్కల పన్నిండూళ్లు. ఆ ఊళ్లకంతా వడ్రంగి పని కమ్మరిపని రొండూ కేశివాశారి చేతల మింద జరగాల్సిందే. అందుకే కొందురు కేశివాశార్ని వడ్లోల కేశివాశారి అంటే కొందురు కమసలోళ్ల కేశివాశారి అంటారు. వడ్లోడైతే ఏమి? కమసలోడైతే ఏమి? మొనగోడు యీది నాటకాల్లో దర్మరాజుల ఏసిం గట్టాడు. గొంతెత్తి నాడంటే ఎళువుగుట్టకు దగిలి మల్లా ఎనిక్కొచ్చేది ఆరాగం!

కొలిమి ముందర కూసుంటే గూడా మణిసి దర్మరాజే గదా?

''కేశివన్నా! కేశివన్నా! మా తల్లిసాచ్చిగా రాగి పైర్లో కసువు మానావరిగా పడిపోయిందన్నా. అయిదు దినాలుగా కాలికి బలపం గట్టుకుంటే ఆరే మంది కూలోళ్లు దొరికినారు. నీకు పుణ్ణె ముంటింది. ఆ తొలికలట్టా తట్టియ్యన్నా!'' అని ఒకడు బతిమాల్తా ఉంటే-

''బావా! బావా! కానబాయిలో మోట. తోల్తా తోల్తా ఉండి నిలబెట్టేసి పరుగుల మిందొస్తా ఉండా. మోటబండికి ఉళవాయిలు ఊడొచ్చేసినాయి. బారిలో ఎద్దులు బార్లోనే ఉండాయి. ఆ బాయికింద జొన్న పైరు. ఇప్పుడిప్పుడే కంకిమింది కొస్తా ఉండాది. ఇంకా సగానికి పైగా తడిబడాల. నీకు పుణ్ణెముంటింది. దీన్నట్టా సర్సేసి యియ్ బావా!'' అంటా అయినేరోళ్ల సాంబడు అంగలారస్తా ఉంటే-

''ఈ గెడ్డపారట్టా మొనేసియ్యరాదా?'' అంటా శాస్త్రా లాయిన పై చూపులు చూస్తా వుంటే-

''ఆశారీ నువ్వే జెప్పు. పెనుమూరు పేట్లో ఈ పాత్రేకు తెచ్చిందెప్పుడు? మొన్న సంతనాడు గాక అంతకుముందు సంతనాడు. ఆ పొద్దుట్నుంచి చిన్నబిడ్డ తిరిగినట్టు తిరగతానే ఉండా. ఈ పారట్టా కట్టిస్తే నీ చేతులేమన్నా బంగారై పూడస్తాయా?'' అని

జంబాలుగాడు యాష్టపోతా ఉంటే-

కేశివాశారి బామార్ది యీరబద్రాశారి బాడ్సెత్తుకోని మడకలు చెక్కతా ఉంటే... చెక్కేసిన మడకలకు కేశివాశారి కొడుకులు నర్సిమ్ముడు కిష్టుడు తొలలు కొట్టా వుంటే ఆడ ఒక ఏడికి జరిగినట్లుండేది.

ఇట్టా మాదిర పల్లెల్లో కొలువులు రగల్నాలే కానీ రైతు చేతినిండికీ పనేగదా? ఎప్పుడు రైతు చేతినిండికి పని ఉంటిందో అప్పుడు రాజ్జిం గూడా సుకంగా ఉంటింది. మరి అతగాడెవుడబ్బా? 'కొలువులు రగులు కుణ్ణాయిరా అబ్బోడా?' అంటా వల్లమాల్నె యాష్ట వొలకబోసెనే?' అని ఆలోచించుకుంటా ఎట్నో చూస్తావుంటే బుజం మీద చెయ్యి పడె!

తిగిరి చూస్తే ముత్తారెడ్డన్న!

''ఒరే అబ్బోడా! పల్లెల్లో కొలుములు రగులు కుంటే అంతకంటే కావాల్సింది యింకే ముండాదని గదా ఆలోచిస్తా ఉండావు. అసలు 'కొలిమి' అంటే ఏందిరా? అదీ ఒక పొయ్యేగదా. పొయ్యిలో మంట కంటికి కనిపిస్తింది. అదే కొలిమిలో అయితే కనిపించదు. అంటే- కంటికి కనిపించకుండానే కాల్చేసేదిరా కొలిమంటే! అయినా యిప్పుడు పల్లెల్లో నీళ్లలేకుండా నిప్పులు కురస్తా ఉంటే ఆడ యింక కొలుముల్తో ఏం పనుండాదిలే? అడువులకు అగ్గిపెట్టగుడ్డని మనకు తెల్సు. అయినా పెట్టా ఉండాం. ఎందుకు? చెత్తాచెదారం అంతా సుద్దంగా కాలి పోవాలని. నాలుగు చినుకులు రాల్తే పచ్చంగా యిగిరిస్తిందని! గొడ్డూగొదకంత మేపు దొరికితిందని! -

మనం సమ్మత్సరానికి వొగిటేతూరి అగ్గిపెట్టే మహన్నబావులు అయిదేండ్ల కొకతూరి అగ్గి పెట్టేస్తా ఉండారు. అప్పుడు పల్లెలకు పల్లెలే కొలుములై రగులుకుంటాయి. అటుమంటప్పుడు అవ్వి కనపడకుండానే కాలస్తాయి. చూస్తానే ఉండు. ఎన్ని బతుకులు నిట్ట నిలవనా కూలి పోతాయో? ఎంత మంది రాలి పోతారో? కోడిపుంజుల కాళ్లకు కత్తులు గట్టి ఏడిక చూసినట్టేగదా యవ్వారం!'' అనె.

నేనొక సుద్ద ఎంబరెమ్మని! ఈ యరవదాకా నా కడుపు రగిలింది గూడా కొలిమి మాదిర్తోనే గదా? ●